అమ్మా! మా ఇంటికి రావూ!

— దువ్వూరి రాజారెడ్డి

'తెల్లవారుతుండగానే' ...

'రేపుదయాన్నే లేవాలి,
గుడిగోపురం మీద ఎగిరే పావురాల్ని చూడాలి,
దండెం మీద ఊగే పిచ్చుకల వరసల్ని పలకరించాలి,
పచ్చని మైదానంలో కదిలే గొర్రెల గుంపుల్ని గమనించాలి,
వీటన్నింటికన్నా ముందు
అమ్మాయికి, అబ్బాయికి ఉత్తరాలు రాయాలి.
అవును, 'అమ్మా నాన్నని తీసుకెళ్ళమని' రాయాలి.
తప్పకుండా రాయాలి.

రాత్రంతా ఆలోచిస్తూ తెల్లవారుజామునికి ఈ నిర్ణయానికొచ్చాడు పరంధామయ్య. ఉద్యోగం చేస్తున్నన్నాళ్ళూ ఎన్నో ఊళ్ళు తరిగి, రిటైరైన తర్వాత తండ్రి కట్టించిన ఇంట్లో, చిన్ననాటి రోజులు గుర్తుకు తెచ్చే స్వంత ఊర్లో సెటిలయ్యాడు. పరంధామయ్యకు ఇద్దరు పిల్లలు. కొడుకు శేఖర్ హైదరాబాద్‌లో ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్, కూతురు సుజాత విశాఖపట్నంలో బ్యాంక్ క్లర్క్. పెన్షన్ వస్తూండటంతో డబ్బు కోసం ఎవరి మీదా ఆధారపడాల్సిన అవసరం రాలేదు. కానీ వయసు పెరిగే కొద్దీ, శరీరం మనసుకు సహకరించడం మానెయ్యసాగింది. తన వాళ్ళ మీద ఆధారపడక తప్పని పరిస్థితి, పిల్లలతో ఉండాలనే తపనా కలిసి, పుట్టి పెరిగిన ఊరి మట్టిలోనే కలిసిపోవాలన్న ఆలోచనకి స్వస్తి పలకడానికి దోహదం చేసాయి.

అంతకు ముందు కూతురు, కొడుకు 'ఈ పల్లెటూళ్ళో ఏముంది నాన్నగారూ, ఈ ఇల్లమ్మేసి మా దగ్గర కొచ్చెయ్యకూడదూ...' అని ఎన్నిసార్లు పోరు పెట్టినా ససేమిరా రానని మొండికేసిన పరంధామయ్య చివరికి పిల్లల్దగ్గరకే వెళ్ళిపోవాలని నిర్ణయించుకున్నాడు. రాత్రి ఉదయంలోకి మారింది.

ఆలస్యంగా నిద్రపట్టిన పరంధామయ్యకు, ఆరుగంటల్దాటిం తర్వాత గానీ మెలకువ రాలేదు. లేచీలేవగానే తన నిర్ణయాన్ని భార్య శారదకి చెప్పాడు.

'అదేంటండీ, పిల్లలన్నిసార్లు బతిమాలినా ఒప్పుకోనివారు ఇలా... అయినా మీ అవసరాలు నేను చూట్టం లేదా! వాళ్ళనెందుకు, ఇబ్బంది పెట్టడం' శారదమ్మ గొంతు, ఆశ్చర్యం, అనుమానం నింపుకుని ధ్వనించింది.

'మనకి వాళ్ళు పెట్టాలటే! నా పెన్షన్ చాలదూ, మనిద్దరం తింటానికి. మన చేతుల్లో పెరిగి పెద్దైన వాళ్ళ రెక్కల నీడన అలసట తీర్చుకుందామని...'

ఆ పిచ్చితండ్రి తపనకి శారదమ్మకి కన్నీళ్ళొచ్చాయి.

భర్త చూడకుండా చెంగుతో కళ్ళొత్తుకుంది.

పరంధామయ్య ఇవేవీ గమనించే స్థితిలో లేడు.

తన డైరీలో నుండి రెండు కార్డులు తీసి 'వెంటనే వచ్చి తమని తీసుకెళ్ళమని' పిల్లలిద్దరికీ రాసి పక్కవీధిలోని పోస్టు డబ్బాలో పడేసి, వచ్చి వీధరుగు మీద కూర్చున్నాడు.

'ఏమండీ... కాఫీ చల్లారిపోతోంది' భార్య పిలుపుతో లేచి లోపలికెళ్ళాడు.

కాఫీ గ్లాసు పట్టుకుని బయటకొచ్చాడు.

కాఫీ తాగడం, అరుగు మీద కూర్చోవడం,
అన్నం తినడం, దారిన పోయే వాళ్ళని పలకరించడం,
టీ తాగడం, మళ్ళీ అరుగు మీదకి చేరడం,
తినడం, పడుకోవడం... పడుకోవడం, తినడం...

విసుగ్గా ఉంది. మనుమలతో ఆడుకోవాలని, కొడుకు కూతురు పరామర్శలని అందుకోవాలని ఆయనకి ఆరాటంగా ఉంది. తను ఏం మాట్లాడినా పిల్లల గురించే, ఏది తింటున్నా... 'ఇది వాడికిష్టం, అది దానికిష్టం' అని గుర్తు చేసుకోవడంలోనే రోజులు గడుపుతున్నాడు. శారదమ్మకి మాత్రం భర్త ఇంకో పిల్లాడిలా అనిపించసాగాడు. పిల్లలిద్దరూ దూరంగా వెళ్ళి స్వతంత్రంగా బ్రతుకుతూంటే, ఈ పిల్లవాడు మాత్రం రోజురోజుకీ పసిపిల్లాడై పోతున్నాడు. ఈ 'పిల్లాడి' ఆలనా పాలనా చూసుకోవడంతోనే ఆవిడకి సరిపోతోంది. పరంధామయ్య ఆలోచనలు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. భార్య సాహచర్యంలో సేద తీర్చుకోవడం కన్నా, పిల్లల ప్రయోజకత్వం కళ్ళారా చూస్తూ, మనుమలతో ఆడుకోవడం కోసం ఆయన కలలు కనడం ప్రారంభించాడు, ఆ రోజు కోసం నిరీక్షించడం మొదలెట్టాడు.

ఉత్తరాలు పోస్ట్ చేసిన నాటి నుండి పరంధామయ్య మకాం పూర్తిగా ఇంటి అరుగుల మీదకి మారిపోయింది.

'వాళ్ళొస్తే లోపలకి రారా... ఆ అరుగుల మీదే పడుండటం ఎందుకు?'

భార్య మందలింపులు ఆయనకి అలవాటై పోయాయి.

అలా ఒక వారం గడిచింది.

ఆ రోజు ఎప్పటి మాదిరిగానే పరంధామయ్య వీధరుగు మీద పడక్కుర్చీలో కూర్చుని పేపర్ చదువుకుంటున్నాడు.

'అమ్మా' ఎవరిదో బాగా పరిచయమైన గొంతు.

తలెత్తి చూశాడు.

ఎదురుగా శేఖర్.

ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బయ్యి 'శారదా' అని గట్టిగా పిల్చాడు.

'ఏమయిందండీ... ఎందుకా గావుకేకలు' విసుగ్గా అంటూ శారదమ్మ బయటకొచ్చింది.

'శారదా ఎవరొచ్చారో చూడు'

'ఏమ్మా ఎలా ఉన్నావు? ఇంత చిక్కిపోయావేంటమ్మా... నాన్నగారి లెటర్చూసిందగ్గర్నుండి రావాలని... సెలవు దొరకలేదమ్మా...' అమ్మతో మాట్లాడుతూ లోపలికెళ్ళాడు శేఖర్.

శారదమ్మ శేఖర్‌కి మంచినీళ్ళందించింది.

తల్లీకొడుకు లిద్దరూ కబుర్లలో పడ్డారు.

ఒక గంట గడిచింది.

ఒక్కసారి కూడా బయటకొచ్చి అరుగు మీదే కూర్చోనున్న నాన్నని పలకరించలేదు. పరంధామయ్య మనసు పరిపరి విధాలాలోచించడం మొదలెట్టింది. 'శేఖర్ ఎందుకిలా ప్రవర్తిస్తున్నాడు, తను ఎన్నిసార్లు పిల్చినా ఈ ఊరొదిలి రానన్నానని కోపమా... ఇప్పుడు వస్తానంటున్నా కదా'

'పరంధామయ్యగారూ, బావున్నారా'

ఆలోచన్లోంచి ఈ లోకంలోకి వచ్చి చూశాడు. ఎదురుగా ఊరి మునసబు నిలబడి ఉన్నాడు.

'రండి మునసబుగారూ' లేచి తను కూర్చున్న కుర్చీ చూపించాడు.

'శేఖరం ఉన్నాడా?'

'ఆ... లోపలున్నాడు... వాడితో ఏంటి పని?'

'నా పని కాదు, మీ పనే.... ఏమయ్యా శేఖరం' గట్టిగా పిల్చాడు.

'నమస్కారం మునసబుగారూ రండ్రండి' శేఖరం హడావిడిగా బయటకొచ్చాడు.

'రా బాబూ, అవతల నాకు బోల్డు పనులున్నాయి'

'పదండి' అంటూ శేఖరు, మునసబుగారు ఇద్దరూ వీధిలోకి వెళ్ళారు.

అరుగు మీద నుండి పరంధామయ్యకి వీధి స్పష్టంగా కన్పిస్తూంది. వీధి వాకిలి ముందు నిల్చుని కరణంగారు, ఊరి తలారి పొలాలు అవీ కొలిచే గొలుసు పట్టుకుని ఇంటి చుట్టూ తిరుగుతూ కొలతలు తీసుకుంటున్నారు.

'కాంపౌండ్ అయిపోయింతర్వాత, ఇంటి లోపలి వైశాల్యం కూడా చూడండి కరణంగారూ' మునసబుగారి గొంతు బొంగురుగా వినపడింది.

పరంధామయ్యకు ఏం జరుగుతోందో సరిగా అర్థం కాలేదు, కానీ ఏదో జరుగుతూందని మాత్రం అనుమానం కలిగింది.

మెల్లిగా అరుగు దిగి వీధి వాకిలి దగ్గరికొచ్చి చుట్టూ చూశాడు.

వీధికటువైపు చెట్టు కింద మునసబుగారు, శేఖర్ నిలబడి ఏదో మాట్లాడుకుంటున్నారు.

పరంధామయ్యని చూసి ఇద్దరూ దగ్గరకొచ్చారు.

ఇంటి బయట కోలాహలం గమనించి శారదమ్మ కూడా వీధి వాకిలి దగ్గరకొచ్చి నిలబడింది.

'ఏమిటిది మునసబుగారూ...' అడిగాడు పరంధామయ్య.

'ఏమయ్యా శేఖరం, మీ నాన్నగారికి విషయం చెప్పలేదా'

'అదేనమ్మా...' శేఖర్, శారదమ్మ వైపు చూస్తూ చెపుతున్నాడు.

'... ఈ ఇల్లు అమ్మేస్తున్నాం. మా ఇంటి మీద నీకు ఉండటానికో రూం కట్టిస్తాను. నువ్వక్కడ హాయిగా ఉండొచ్చు. నాన్నగారికి అక్కంటే ఇష్టం. ఆయనెలాగూ మా ఇంటికి రాడు...'

పరంధామయ్య చెవులు వినడం మానేసినట్టున్నాయి. నీరసంగా అక్కడి నుంచి కదిలి అరుగు మీద కూలబడ్డాడు.

'ఒరే శేఖరం, ఇదా నువ్వు చేస్తున్న నిర్వాకం, మీ నాన్న ఈ ఊర్లో ఉండలేక, స్వతంత్రంగా బతకలేక కాదురా మీ దగ్గరకు వస్తానని రాసిందీ... మీ ప్రతిభ, ప్రయోజకత్వాన్ని కళ్లారా చూడాలని, మీ పిల్లలతో ఆడుకోవాలని. అలాంటిది నువ్వు ఆయనకు నిలవ నీడ కూడా లేకుండా చెయ్యాలని ప్రయత్నిస్తున్నావా... నా ప్రాణం పోయినా ఈ ఇల్లు అమ్మనివ్వను...' శారదమ్మ ఎప్పుడూ లేంది గట్టిగా అరుస్తూంది.

'మీ అమ్మానాన్నకు నచ్చజెప్పు శేఖరం. మళ్ళీ సాయంకాలం వస్తాం' అనేసి మునసబుగారు అండ్ పార్టీ వెళ్ళిపోయారు.

పరంధామయ్య బాధగా కళ్ళు మూసుకున్నాడు.

'పరంధామయ్యగారూ' పోస్టమాన్ గంగాధరం కేక వినపడింది.

కళ్ళు తెరిచి చూశాడు.

ఎదురుగా నేల మీద పడి ఉందో ఇన్లాండ్ లెటర్.

మెల్లగా లేచి వెళ్ళి లెటర్ చేతిలోకి తీసుకుని ఫ్రం అడ్రస్ చూశాడు.

'సుజాత, వైజాగ్' అని రాసుంది.

హృదయంలో ఎక్కడో మూల ఆశ తళుక్కుమనగా చించి చదవడం మొదలెట్టాడు.

'నాన్నగారికి నమస్కారాలు,

కులాసాగా ఉన్నారనుకుంటాను. ఇన్ని రోజులకి మీరు ఆ పల్లెటూరు వదిలి రావటానికి నిశ్చయించుకున్నందుకు చాలా సంతోషించాం. మీకు మొదట్నుండీ తమ్ముడంటేనే కదా ఇష్టం. మీరెలాగూ మా ఇంటికి రారు. అమ్మని వెంటనే పంపండి. ఇకపోతే మీ అల్లుడుగారు ఆఫీసుకి సిటీబస్సుల్లో వెళ్ళలేక పోతున్నార్ట. మన ఇల్లు అమ్మేసి మాకో పాతికవేలు సర్దితే స్కూటర్ కొనుక్కుంటార్ట. మీకు రాయమన్నారు. లెటర్చూసిం దగ్గర్నుండీ 'అమ్మమ్మ ఎప్పుడొస్తుందీ' అని చిన్ని ఒకటే సతాయిస్తూంది. అమ్మ ఏ ట్రైన్ కొస్తుందో రాస్తే స్టేషన్‌కి మీ అల్లుడుగార్ని పంపిస్తాను.

మీ ఆరోగ్యం జాగ్రత్త. క్షేమ సమాచారాలు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ ఉండండి. ఉంటాను.

మీ సుజాత'

పూర్తిగా చదివాక, మళ్ళీ చదివాడు.

మళ్ళీ మళ్ళీ చదివాడు.

కళ్ళజోడు తుడిచి పెట్టుకుని మరీ చదివాడు.

కానీ సారాంశంలో మార్పు కనపడలేదు.

'ఎవరి దగ్గర్నుంచండీ ఉత్తరం' శారదమ్మ అడిగింది.

కళ్ళు మూసు కుని ఉత్త రం అందిం చాడు.

మనసు మూలుగుతోంటే మాటలు అస్పష్టంగా పరంధామయ్య గొంతు దాటి బయటకొచ్చాయి.

'ఒరే శేఖరం, మీ ఇద్దరి అభిప్రాయాలూ ఒక్కటే. మీకూ, మీ పిల్లలకీ సేవ చెయ్యడానికి జీతంలేని, బోనస్ అడగని, సెలవు పెట్టని, రోజుకి ఇరవై నాలుగ్గంటలు పనిచేసే ఓ పనిమనిషి కావాలి. దానికి మీరు పెట్టిన అందమైన పేరు అమ్మ. అది మీ తప్పు కాదురా. మీరు పుట్టినప్పుడు అందరిలా సహజంగానే పుట్టారు. పసివాళ్ళుగా పక్కలోనే కాలకృత్యాలు తీర్చుకున్నారు. తల్లిదండ్రులుగా మేమే మీకు భాష నేర్పాం, బట్టలు వేసుకోవడం నేర్పాం, మిమ్మల్ని మీరు ప్రేమించుకోవడం నేర్పాం, పేలాలు జేబులో పోసి 'ఎవరికీ పెట్టకుండా తిను' అని స్వార్థాన్ని కూడా నేర్పాం. కానీ మీరు పెరిగి పెద్దై స్వార్థాన్ని మాత్రమే ప్రేమించడం మొదలుపెట్టారు. కన్నతల్లిదండ్రుల్నే భారంగా అనుకుంటున్న మీ నిజస్వరూపాల్ని చూశాక్కూడా, ఇంకా మీ దగ్గర మా శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని అనకోవడమంత మూర్ఖత్వం మరోటుంటుందా... భగవంతుడా, వద్దు వీళ్ళ దగ్గరకెళ్ళం. వీలయినంత త్వరగా మమ్మల్ని నీ దగ్గరకి తీసుకెళ్ళవూ...' భారంగా కళ్ళు మూసుకున్నాడు పరంధామయ్య.

☆